సాక్షి మెదక్

గురువారం । 3 । ఏప్రిల్ । 2025



పెద్దల గెట్టు తాకని భూసేకరణ

ఇండస్ట్రియల్ పార్కు కోసం పెద్దల గెట్టు తాకకుండా పేదల భూములనే సేకరించడం విశేషం.

వివరాలు 8లో ▸



చెరువులో మునిగి విద్యార్థి మృతి

నర్సాపూర్ రాయరావు చెరువులో మునిగి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు.

వివరాలు 8లో ▸



వాగులను తోడేస్తున్నారు..


ఎలాంటి అనుమతులు లేకుండానే ఇసుక మాఫియా తవ్వకాలు చేస్తున్నారు.

వివరాలు 9లో ▸

గోదాముల్లో గోల్‌మాల్!

గోదాం ఇన్‌చార్జిల అక్రమాలు

- ఐదేళ్లలో 11 వేల క్వింటాళ్ల బియ్యం మాయం
- 19 లక్షల గన్నీబస్తాలు విక్రయం
- రూ. 15.67 కోట్ల ప్రభుత్వ సొమ్ము పక్కదారి
- సస్పెండ్ అయిన వారే మళ్లీ విధుల్లోకి..



మెదక్ కేంద్ర గిడ్డంగుల సంస్థ

సాక్షి ఫోకస్

కంచె చేను మేసిన చందంగా.. పేద ప్రజలు తినే బియ్యాన్ని నిల్వ ఉంచే ఎంఎల్ఎస్ పాయింట్లకు రక్షణ కల్పించాల్సిన గోదాం ఇన్‌చార్జిలు అడ్డదారి తొక్కారు. వేలాది క్వింటాళ్ల బియ్యంతో పాటు లక్షలాది గన్నీ బస్తాలను అమ్ముకున్నారు. ఐదేళ్ల వ్యవధిలో రూ. 11.67 కోట్ల విలువ చేసే ప్రభుత్వ సొమ్మును మింగారు. అయినా వారి నుంచి ఆర్ఆర్‌యాక్ట్ కింద ఒక్కపైసా రికవరీ చేయలేకపోయారు. విచిత్రమేమిటంటే సస్పెండ్ అయిన వారే మళ్లీ విధుల్లో చేరుతున్నారు.

– మెదక్‌జోన్

జిల్లావ్యాప్తంగా పెద్దశంకరంపేట, పాపన్నపేట, చేగుంట, మెదక్, రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్‌లో మొత్తం 7 ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వీటిలో గత ఐదేళ్ల కాలంలో మెదక్, రామాయంపేట, తూప్రాన్, చేగుంట నాలుగు (ఎంఎల్ఎస్) స్టాక్ పాయింట్లలో ఐదుగురు గోదాం ఇన్‌చార్జిలు విధులు నిర్వర్తించారు. వీరు పోటీ పడి మరి ఐదేళ్ల కాలంలో 11,086.66 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టించారు. అంతేకాకుండా 19,44,200 లక్షల గన్నీ బస్తాలను అమ్ముకున్నారు. వీటి విలువ అక్షరాల రూ. 15,67,90,862 కోట్లు. అయితే ఆలస్యంగా పసిగట్టిన ఉన్నతాధికారులు విచారణ జరిపి సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులు ఈవిషయాన్ని అప్పట్లో బట్టబయలు చేయగా, రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

తాజాగా 35 క్వింటాళ్ల బియ్యం

నమ్మకానికి మారుపేరైనా కేంద్ర గిడ్డంగుల సంస్థ నుంచి తాజాగా మార్చి 31వ తేదీన 35 క్వింటాళ్ల బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా డీసీఎంలో తరలించారు. గమనించిన ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మెదక్ పట్టణ పోలీసులు వాహనాన్ని వెంబడించి అదుపులోకి తీసుకొన్నారు. తమదైన శైలిలో విచారణ జరిపి డ్రైవర్‌తో పాటు యజమానిపై కేసు నమోదు చేశారు. కాగా కేంద్ర గిడ్డంగుల అధికారి ఆదేశాల మేరకే తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో తేలింది.

గోదాంలో తనిఖీలు

కేంద్ర గిడ్డంగుల సంస్థ గోదాం నుంచి మార్చి 31వ తేదీన 35 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలించిన విషయమై మంగళవారం 'సాక్షి'లో 'దొంగ చేతికి' తాళం అనే కథనం ప్రచురితమైంది. దీనిని స్పందించిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సిబ్బంది బుధవారం గోదాంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బియ్యం తక్కువగా వచ్చినట్లు నిర్ధారించారు. ఈ విషయమై రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎఫ్‌సీఐ ఇంటెలిజెన్స్ సిబ్బంది తెలిపారు. కాగా వారి పేర్లు తెలిపేందుకు వారు నిరాకరించారు.

పైసా రాబట్ట లేదు..

గోదాంల ఇన్‌చార్జిలు ఐదుగురి నుంచి రూ. 15.67 కోట్ల ప్రజాధనాన్ని ఆర్ఆర్‌యాక్ట్ ఉపయోగించి తిరిగి కక్కిస్తామని గతంలో అధికారులు చెప్పారు. కానీ ఇప్పటివరకు వారి నుంచి పైసా రికవరీ చేయలేదు. కేసులు నమోదు చేసి జైలుకు పంపగా, బెయిల్‌పై తిరిగి వచ్చి యథావిధిగా విధుల్లో చేరుతున్నారు. ఐదుగురు నిందితుల్లో ఇప్పటికే ఇద్దరు విధుల్లో చేరగా, మరో ముగ్గురు ఉద్యోగంలో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

● పరీక్షలు ముగిశాయోచ్



టేక్మాల్: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



హవేళఘణాపూర్: ఎంజేపీ పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు

పాపన్నపేట(మెదక్): విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 21వ తేదీన ప్రారంభమైన పరీక్షలు సాంఘీక శాస్త్రం పరీక్షతో పరిసమాప్తమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 10,388 మంది విద్యార్థులకు 10,241 మంది పరీక్షలు రాశారు. 147 మంది వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదు. చివరి పరీక్ష రాసి కేంద్రాల్లో నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు ఆనందంగా కన్పించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ సంతోషాన్ని పంచుకున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యవేక్షణలో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

బియ్యం అమ్మితే రేషన్ కార్డు కట్

కలెక్టర్ రాహుల్‌రాజ్



సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్‌రూరల్/హవేళిఘణాపూర్(మెదక్): సన్న బియ్యం అమ్మితే లబ్ధిదారుల రేషన్ కార్డు కట్ చేస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సన్న బియ్యం పంపిణీ చేస్తే అందరూ తినగలుగుతారని ఆలోచించి ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. జిల్లావ్యాప్తంగా 2,13,820 తెల్ల రేషన్‌కార్డుదారులకు 4430.496 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఆనంద్, మాజీ కౌన్సిలర్లు లలిత, సరిత, మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్, జైపాల్, నర్సింలు, స్వరూప, ఫహీం తదితరులు పాల్గొన్నారు. అలాగే హవేళిఘణాపూర్‌లో సన్న బియ్యం పంపిణీని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. కొందరు అంత్యోదయ కార్డు ద్వారా 30 కిలోల బియ్యం వచ్చేవని, ప్రస్తుతం రాకపోవడంతో పూట గడవడం కష్టంగా మారిందని కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. దీంతో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పేదలకు కడుపునిండా సన్న బువ్వ

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



మెదక్‌లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్/హవేళిఘణాపూర్/రామాయంపేట: రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలోని రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు సన్నబియ్యం తినాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం అన్నారు. సన్నధాన్యం కొనుగోలు చేసి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇచ్చి రైతులకు అండగా నిలిచామన్నారు. అంతేకాకుండా ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో దాదాపు రూ. వెయ్యి కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హవేళిఘణాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏడాదిలోపే రైతులకు రుణమాఫీ, రైతు భరోసాను అమలు చేసినట్లు తెలిపారు. అలాగే రామాయంపేట మున్సిపాలిటీలోని రేషన్ దుకాణాల్లో ఎమ్మెల్యే సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. అనంతరం దామరచెరువు గ్రామంలో రూ. 1.95 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సుమారు రూ. 14.50 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సుప్రభాత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు యుగేందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లతో జర భద్రం

డీఎస్పీ ప్రసన్నకుమార్



బాధితులకు సెల్‌ఫోన్‌లు అప్పగిస్తున్న డీఎస్పీ

పాపన్నపేట(మెదక్): మొబైల్ యాప్‌లలో వచ్చే ప్రకటనలు నమ్మి, బెట్టింగ్‌లు పెట్టి ఆర్థికంగా నష్టపోయి ప్రాణాలు తీసుకోవద్దని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం పాపన్నపేటలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న 22 మంది బాధితులకు వాటిని రికవరీ చేసి అప్పగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా చోరీకి గురైన ఫోన్‌లను గుర్తించామన్నారు. మొబైల్ ఫోన్ చోరీకి గురి కాగానే బాధితులు వెంటనే తమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఐఎంఈఐ నంబర్‌ను భద్రపర్చుకోవాలన్నారు. రాష్ట్రంలో మొబైల్ ఫోన్‌ల రికవరీలో మెదక్ జిల్లా ముందంజలో ఉందని వివరించారు. ఈసందర్భంగా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, ఏఎస్‌ఐ సంగన్న, గాలయ్య, కానిస్టేబుల్ దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

అదృశ్యమై.. భువనగిరిలో ప్రత్యక్షమై

అధికారులను పరుగులెత్తించిన కేజీబీవీ విద్యార్థిని



పాపన్నపేట(మెదక్): కేజీబీవీలో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థిని బుధవారం పాపన్నపేటలో అదృశ్యమై.. భువనగిరిలో ప్రత్యక్షం అయింది. పోలీసుల కథనం ప్రకారం.. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కు చెందిన దంపతులకు ఒక కుమార్తె (15) ఉంది. కొంతకాలం క్రితం తండ్రి మరణించడంతో తల్లి, కూతురు భువనగిరి ప్రాంతానికి వెళ్లారు. అయితే అక్కడ కూతురును మొదట భువనగిరిలోని కేజీబీవీలో చేర్పించి తర్వాత పట్టించుకోవడం మానేసింది. దీంతో బాలికను అధికారులు కొంతకాలం అక్కడి బాల సదనంలో చేర్పించారు. అక్కడి నుంచి మెదక్ బాలసదనం తీసుకొచ్చారు. ఈఏడాది పాపన్నపేట కేజీబీవీలో 8వ తరగతిలో చేర్పించారు. అయితే జాయిన్ అయినప్పటి నుంచి ఇక్కడ ఉండటానికి ఇష్టపడటం లేదు. ఈ క్రమంలో బుధవారం అటెండెన్స్ తీసుకున్న అనంతరం అదృశ్యమైంది. వెంటనే విషయాన్ని గుర్తించిన ఎస్ఓ బాలలక్ష్మి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చింది. డీఈఓ రాధాకిషన్, ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి పాపన్నపేట కేజీబీవీకి చేరుకొని జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే సాయంత్రం బాలిక భువనగిరి బాలసదనం చేరుకోవడంతో వారు అక్కడి సఖి కేంద్రంలో అప్పగించారు. విషయాన్ని పోలీసులు, అధికారులు ధృవీకరించారు. పొద్దంతా ఉరుకులు పరుగులతో ఆందోళన చెందిన అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

●బోనం.. వైభవం



మండలంలోని సంగాయిపేటలో కొలువైన ముత్యాలమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి మంజీరా జలాలతో అభిషేకం, అలంకరణ చేశారు. అమ్మవారి సన్నిధిలో మహిళలచే సామూహిక కుంకుమార్చన చేశారు. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

- కొల్చారం(నర్సాపూర్)

పైసలివ్వకుంటే పొద్దు గడిచేదెట్లా?

- ఉపాధి కూలీ డబ్బులకు తప్పని నిరీక్షణ
- రోజులు గడుస్తున్నా అందని కూలి
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కూలీలు
- ప్రతీ వారం డబ్బులు ఇప్పించాలని వినతి



ఉపాధి హామీలో పని చేస్తున్న కూలీలు

సంగారెడ్డి జోన్: గ్రామాలలో వలసలు నివారించేందుకు 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసి కూలి డబ్బుల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. పనులు పూర్తిచేసి నెల రోజులు పూర్తి కావస్తున్నా కూలీలకు మాత్రం కూలి చెల్లించడం లేదు. కూలీలకు సరైన సమయంలో డబ్బులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

45 రోజులు... రూ. 36.46 లక్షలు

జిల్లాలో గత ఫిబ్రవరి 14 నుంచి మార్చి 31 వరకు ఉపాధి హామీలో పనులు చేసిన కూలీలకు మాత్రం డబ్బులు రాలేదు. సుమారు 45 రోజుల డబ్బులు రూ. 36.46లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి కూలి పని చేసిన 15 రోజులకు కూలి డబ్బులు రావాల్సి ఉంటుంది.

కొలతల ఆధారంగా చెల్లింపు

ఉపాధి హామీ పథకంలో కూలీలు చేసిన పనులకు కొలతలు చేపట్టి చెల్లింపులు చేస్తుంటారు. ప్రతీరోజు పనులు పూర్తికాగానే పని ప్రదేశం వద్దే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ ఆన్‌లైన్ విధానంలో కూలి హాజరు వేస్తారు. వారం రోజులకొకసారి టెక్నీషియన్ అధికారులు చేసిన పనుల కొలతలు చేపట్టి మెజర్మెంట్ బుక్(ఎం.బీ) రికార్డు చేసి ఆన్‌లైన్ విధానంలోనే చెల్లింపులు చేస్తుంటారు.

కూలీ డబ్బులు చెల్లింపులకు స్లిప్పులు

కూలీలు చేసిన పనులకు ఎంత మేర డబ్బులు వస్తాయి? ఎక్కడ పని చేశారు? కూలి పేరుతో పాటు వర్క్ ఐడీ తదితర వివరాలతో కూడిన స్లిప్పులు కూలీలకు పంపిణీ చేస్తారు. వారానికి ఒకసారి చేసిన పనులకు లెక్కచేసి స్లిప్పులు అందిస్తారు. స్లిప్పులు ఆధారంగానే డబ్బులు వస్తాయి.

కూలీలకు తప్పని ఆర్థిక ఇబ్బందులు

పనులు పూర్తి చేసి రోజులు గడుస్తున్నా సరైన సమయంలో కూలి డబ్బులు రాకపోవడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు తప్పడం లేదని కూలీలు వాపోతున్నారు. తమ అవసరాలకు డబ్బులు లేకపోవడంతో పనులు చేసిన ఆర్థికపరమైన ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. పనులు చేసే సమయంలో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఒత్తిడి తెస్తారని, డబ్బులు అడిగితే మాత్రం పైనుంచి రావాలని సమాధానం చెబుతున్నారని కూలీలు వివరించారు.

జిల్లాలోని ఉపాధి హామీ వివరాలు

జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీల సంఖ్య	619
జిల్లాలో ఉన్న జాబ్ కార్డుల సంఖ్య	2,19,000
ఉపాధి కూలీల సంఖ్య	4,03,000
జిల్లాలో యాక్టివ్ జాబ్ కార్డులు	1,32,000
జిల్లాలో పెండింగ్ ఉన్న డబ్బులు	రూ.36.46 లక్షలు

ఆరు వారాల డబ్బులు రాలేదు



ఉపాధి హామీలో ఆరువారాల నుంచి డబ్బులు రాలేదు. మాలాంటి పేదోళ్లం ఉపాధి పనికి పోతున్నాం కానీ డబ్బులివ్వకుంటే బువ్వెలా దొరుకుద్ది. అధికారులు ఇప్పటికైనా స్పందించి డబ్బులిప్పించాలి.

–సుజాత, మల్కాపూర్, హత్నూర

న్యూస్‌రీల్

4న విద్యుత్ సమస్యలపై గ్రీవెన్స్ డే

చిన్నశంకరంపేట(మెదక్): ఈనెల 4న మెదక్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దినకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందించవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యుత్ బిల్లు, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను జతచేయాలని సూచించారు.

పోరాటయోధుడు పాపన్నగౌడ్



సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

మెదక్‌జోన్: బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, జాతి విభేదాలు లేకుండా సమసమాజ నిర్మాణ స్థాపన కోసం పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని కొనియాడారు. గౌడ కులస్తుల సంక్షేమం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆ పరిశ్రమపై చర్యలు తీసుకోండి



డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): కార్మికుడి మరణానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సంగారెడ్డిలో డిప్యూటీ లేబర్ కమిషనర్ రవీందర్‌రెడ్డికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొండాపూర్ శివారులోని శ్రీయాస్ పాలిమార్స్ పరిశ్రమలో మంగళవారం రఘునాథ్‌సింగ్ అనే కార్మికుడు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడన్నారు. పరిశ్రమ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. పలు పరిశ్రమల్లో కనీస వసతులు లేకుండానే, భద్రతా చర్యలు చేపట్టకుండానే కార్మికులతో 10 నుంచి 12 గంటల చొప్పున పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాకి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

మైనర్లకు బైక్‌లు ఇస్తే కఠిన చర్యలు: ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: మైనర్లకు బైక్‌లు ఇస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలు బావులు, చెరువులు, వాగుల్లో ఈతకు వెళ్లే అవకాశం ఉందని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. లేదంటే ఈత సరదా ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం అన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తే వారిని పట్టుకొని వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు. వేసవిలో క్రీడా శిక్షణ కేంద్రాలకు పంపి మీ పిల్లలలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని కోరారు.

ఢిల్లీ వెళ్లిన బీసీ సంఘం నేతలు



నిరసనలో జిల్లా నాయకులు

రామాయంపేట (మెదక్): 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన నిరసన ప్రదర్శనకు జిల్లాకు చెందిన బీసీ సంఘం నాయకులు భారీగా తరలివెళ్లారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారం ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెర్సిడెస్ బెంజ్ బీవీజనీర్స్ ఫెలోషిప్‌కు ఎంపిక


స్వామినాథన్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌కు చెందిన రవీందర్ బాలమణి దంపతులు కుమారుడు జైత్ర స్వామినాథన్ ప్రతిష్టాత్మకమైన మెర్సిడెస్ బెంజ్ బీవీజనీర్స్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు. ప్రపంచ వ్యాప్తంగా కేవలం ఒక వెయ్యి మంది యువ ఇన్నోవేటర్లను మెర్సిడెస్ బెంజ్ బీవీజనీర్స్ ఫెలోషిప్‌కు ఎంపిక చేస్తుంది. ఇందులో భాగంగా స్వామినాథన్ ఎంపికై తన ప్రతిభను చాటాడు. దేశ రాజధాని ఢిల్లీ, ముంబాయితో పాటు జర్మనీ వంటి దేశాల్లో జరిగే ప్రపంచ స్థాయి ఇన్నోవేటర్లతో జరిగే సమావేశాల్లో స్వామినాథన్ పాల్గొననున్నాడు. రాష్ట్రం నుంచి స్వామినాథన్ ఎంపిక కావడంపై ఖాజీపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

నర్సాపూర్: గంజాయి అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపారు. నర్సాపూర్‌లోని జగన్నాథరావు కాలనీలో నివాసం ఉండే వెంకటేశ్ ఇంట్లో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందింది. బుధవారం సిబ్బందితో వెళ్లి తనిఖీ చేయగా ఇంట్లో 310 గ్రాముల గంజాయి దొరికిందని, వెంటనే అరెస్టు చేసి ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ఖాజా పాషకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో తనతోపాటు ఎస్ఐ బాలయ్య, ఇతర సిబ్బంది చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, రవి, నవీన్, నరేశ్ పాల్గొన్నారని సీఐ తెలిపారు.

అతిగా మద్యం తాగి పర్మిట్ రూమ్‌లోనే మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అతిగా మద్యం సేవిస్తూ పర్మిట్ రూమ్‌లోనే అపస్మారక స్థితికి చేరుకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట శివారులో చోటు చేసుకుంది. బుధవారం ఎస్ఐ నర్సింహులు కథనం మేరకు.. హత్నూర మండలం సిరిపుర గ్రామానికి చెందిన గంగిరెద్దుల భాషా (45) వడ్డె మల్లయ్య, గంగిరెద్దుల గోవిందులతో కలిసి జగ్గంపేటలో గల ఎస్‌వీఆర్ వైన్స్‌లో గల పర్మిట్ రూమ్‌లో అతిగా మద్యం సేవించి కింద పడిపోయి ఉన్నాడు. విషయం తెలుసుకున్న భాషా కుమారుడు అంబదాసు వచ్చి తండ్రిని లేపగా లేవకపోవడంతో వైద్యుడిని పిలిపించాడు. డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య


శ్రీనివాస్(ఫైల్)

తూప్రాన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి కథనం మేరకు.. గ్రామానికి చెందిన అరకల శ్రీనివాస్(56) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి తిని పడుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి కొంపల్లిలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

గజ్వేల్‌రూరల్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో 12 మంది మద్యం తాగి పట్టుబడ్డారు. వీరిని బుధవారం గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరు పర్చగా విచారణ అనంతరం 12 మందికి రూ. 8,700 జరిమానాతో పాటు ఓ వ్యక్తికి రెండ్రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

పెద్దల గెట్టు తాకని భూసేకరణ

పరిశ్రమల సాకుతో పేదల భూములకు ఎసరు

- వైఎస్సార్ రుణమాఫీతో పేదలకు భూమి హక్కులు
- బోర్లు వేసుకొని పంటలు సాగు
- ఇండస్ట్రియల్ పార్కుతో పేదల ఆందోళన
- వదిలేయాలని బాధితుల డిమాండ్



ఈ ఫొటోలో కనిపించే రైతు పేరు వైనాల రాకేశ్. ఇతడి తండ్రి అశోక్‌కి 1995లో దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూమి కొనుగోలుకు రుణం ఇచ్చింది. అశోక్‌కు 2 ఎకరాల భూమి ఇయ్యడంతో అందులో బోరు వేసుకొని పంటలు సాగు చేసి జీవిస్తున్నాడు. 15 ఏళ్ల కిందటనే అశోక్ మరణించడంతో ఈ భూమిలోనే వ్యవసాయం చేసుకొని తల్లి, కొడుకు బతుకుతున్నారు. ప్రభుత్వం ఇండస్ట్రియల్‌కు వారి భూమి తీసుకుంటుందని తెలువడంతో పేద కుటుంబం ఆందోళన చెందుతుంది. తోటపల్లి శివారులోని మా భూమి వదిలేయాలని ప్రభుత్వ అధికారులను వేడుకుంటున్నారు.


తోటపల్లి శివారులోని దళితుల పచ్చని పంటలు

గ్రామం	ఎకరాలు	రైతులు
చౌటపల్లి	83.36	120
జనగామ	15.20	08
తోటపల్లి	25.20	31
మొత్తం	124.36	159

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించి, టీజీఐఐసీ ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడానికి భూమి కావాలని రెవెన్యూ అధికారులను కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు కనీసం 105 ఎకరాల వరకు అవసరం ఉంటుందని చెప్పారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామంలో 312 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి 83.36 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు సూచించారు. ఇదే మండలం జనగామ శివారులో 15.20 ఎకరాలను సేకరణకు రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. అలాగే, హుస్నాబాద్ మండలం తోటపల్లి శివారులో 25.20 ఎకరాల భూమిని సేకరించడానికి అధికారులు సర్వే చేశారు. మొత్తం 124 ఎకరాల 36 గుంటలకు భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేసి 15 రోజుల కిందట మొదటి దఫా గ్రామ సభ చౌటపల్లిలో ఏర్పాటు చేశారు. రైతులు మా భూములు ఇయ్యమని వ్యతిరేకించడంతో మరోసారి గ్రామ సభ ఏర్పాటు చేయొచ్చని అధికారులు వెళ్లిపోయారు.

పరిశ్రమల సాకుతో పేదల భూమికి ఎసరు..

చౌటపల్లి సర్వే నంబరు 312లో 83.36 ఎకరాల అసైన్డ్ భూముల సమస్యల రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. పట్టాలు ఒకరికి ఉంటే మోకాపై మరొకరు ఉండటంతో రికార్డుల ప్రక్షాళన సమస్య జటిలంగా మారింది. ఈ భూములను ప్రభుత్వం తిరిగి తీసుకొంటే సమస్యకు ముగింపు పలుకొచ్చని అధికారుల ఆలోచనకు కొందరు గ్రామస్తులు మద్దతు ఇవ్వడంతో భూసేకరణ జరుగుతుంది. 1995లో ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పేదలకు భూ కొనుగోలుకు రుణాలు ఇవ్వడంతో తోటపల్లి శివారులోని 12 మందికి 24 ఎకరాల భూమిని కొని ఇచ్చారు. పంటలు సాగు చేసుకుంటూ రుణాలను చెల్లిస్తూ వచ్చిన పేదలకు 2005లో వైఎస్సార్ సీఎం అయిన తర్వాత రుణ మాఫీ చేయడంతో పేదలకు రుణ విముక్తి కలిగి భూముల పై హక్కుల వచ్చాయి. భూములు మావే అనే భరోసాతో బతుకుతున్న దళితులకు చెందిన 14 ఎకరాలను ఇండస్ట్రియల్ పార్కు కోసం తీసుకుంటున్నామని అధికారులు చెప్పగానే దళిత కుటుంబాల్లో ఆందోళన మొదలైంది.

పెద్దల జోలికి వెళ్లని అధికారులు

ఇండస్ట్రియల్ పార్కు కోసం సేకరించే భూములు పెద్ద గెట్టు తాకకుండా పేదల భూములనే సేకరించడం విశేషం. తోటపల్లి శివారులో రోడ్డుకు రెండు వైపుల భూములు ఉన్నప్పటికీ పెద్దలవి వదిలేసి పేదల వ్యవసాయ భూములు, రోడ్డు పక్కనే 11 మంది నివాస స్థలాలు 22 గుంటలను కూడా సేకరణలో నమోదు చేశారు. ఒక్కొక్క ప్లాటుకు రూ.7 లక్షలకు కొనుగోలు చేస్తే ప్రభుత్వం ఎంత పరిహారం ఇస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైసా పైసా కూడబెట్టి భూమి కొన్న



ఇక్కడ పని లేక బతకడానికి పదేళ్లు దుబాయి పోయి పైసా పైసా కూడబెట్టి తోటపల్లి శివారులో 3.20 ఎకరాలు కొని వ్యవసాయం చేస్తున్న. ఇప్పుడు మా భూములు ఇయ్యమంటే ఏట్లా ఇస్తరు. రోడ్డు పక్కన దొర భూములకు పోతలేరు అది రోడ్డు పక్కనే ఉండే ఆ భూములకు పోరు మా బక్కోల్ల భూమి తీసుకుంటారు. పచ్చటి పంటలు పండే భూముల్లో పరిశ్రమలు పెడితే ఎట్లా.

– చుంచు శంకర్, చౌటపల్లి

ఎక్కడ పోయి బతకాలే



ఎస్సీ కార్పొరేషన్ లోను ఇస్తే బాకి తీర్చడానికి పదేళ్లు పట్టింది. మిగిలిన లోను వైఎస్సార్ రుణమాఫీ చేయడంతో తీరిపోయింది. అప్పటి నుంచి మాకు పట్టా పాసు బుక్‌లు రావడంతో బోర్లు ఏసి సదను చేసి పంటలు పండిస్తున్నాం. పచ్చని పంట చేళ్లలో పరిశ్రమ పెడుతామంటే ఏట్లా..? మేం ఎక్కడ పోయి బతుకాలే మాకు భూములు ఎవరు ఇస్తరు.

– చుంచు లక్ష్మయ్య, చౌటపల్లి

రూ.15 లక్షలకు రెండు గుంటలు కొన్న



హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల మధ్య ఊరు భవిష్యత్‌లో వ్యాపారానికి అనువైన ప్రదేశమని రూ.15 లక్షలకు రెండు గుంటలు కొన్న. ఇప్పుడు పరిశ్రమలకు ఇయ్యమంటే ఏట్లా? మా పక్కనే రోడ్డు కింది భూమి ఎందుకు తీసుకోవడం లేదు. భూ సేకరణ చేస్తే సమాన హద్దులతో భూమి తీసుకొంటే బాగుంటది. పలుకుబడి వాళ్ల భూములు వదిలి మా ఇంటి స్థలాలు కావాల్సి వచ్చిందా.

– వెంకటేశ్వర్లు, హుస్నాబాద్

భూ సేకరణ ప్రక్రియ జరుగుతోంది



ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 105 ఎకరాల భూమి కావాలే అని అడిగారు. మూడు చోట్ల కలిసి మొత్తం 124 ఎకరాలను భూ సేకరణకు గుర్తించాం. ఇందులో 14 ఎకరాల వరకు ఎస్సీ కార్పొరేషన్ నుంచి పొందిన భూములు ఉన్నవి మిగితా పట్టా భూములను కూడా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం. పరిహారం ప్రభుత్వ నిర్ణయం మీదనే ఆధారపడి ఉంటుంది.

– రాంమూర్తి, ఆర్డీవో, హుస్నాబాద్

పొద్దు తిరుగుడు ధాన్యం కొనుగోలు చేయాలి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్ రెడ్డి

తొగుట(దుబ్బాక): వ్యవసాయ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల నాయకులతో కలిసి మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొద్ది రోజులుగా కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు నిలిచిపోయినా దుబ్బాక కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పట్టించుకోవడంలేదని ఆరోపించారు. తమది రైతు ప్రభుత్వ మంటూ ఊదరగొట్టే కాంగ్రెస్ నాయకులకు రైతుల బాధలు తెలియవా అని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మార్క్ ఫెడ్ జిల్లా అధికారితో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించామని ఆదేశాలు రాగానే కొనుగోలు ప్రారంభిస్తామని జిల్లా అధికారి వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, మాజీ ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు చందూగౌడ్, పరమేశ్, లక్ష్మణ్, సందీప్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళపై అత్యాచారయత్నం

సంగారెడ్డి: గిరిజన మహిళపై అత్యాచారయత్నం చేయబోయాడు ఓ అగంతకుడు. ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ కథనం మేరకు.. పుల్‌కల్ మండలం గొంగళూరు తండాకు చెందిన అనిత అనే గిరిజన మహిళ సంగారెడ్డికి కూలీ కోసం వచ్చింది. ఆమెను పని ఉందని చెప్పి ఓ అగంతకుడు బొమ్మారెడ్డి గూడెం తండా ప్రాంతానికి అత్యాచారం చేయబోయాడు. ఈ క్రమంలో దాడి చేయగా ఆమె గాయపడింది. అగంతకుడి చెర నుంచి బయటపడిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అగంతకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు. ప్రస్తుతం బాధితురాలు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందని, ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

చెరువులో మునిగి బీటెక్ విద్యార్థి మృతి

- కాలక్షేపం కోసం నర్సాపూర్ వచ్చిన 8 మంది విద్యార్థులు
- కాళ్లు కడుక్కుంటుండగా నీట మునిగి మృత్యువాత
- మృతుడిది హైదరాబాద్‌లోని గాజుల రామారం


విద్యార్థి మనీశ్ మృతదేహం

నర్సాపూర్ రూరల్: చెరువులో మునిగి బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన నర్సాపూర్ రాయరావు చెరువులో బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ లింగం కథనం మేరకు.. హైదరాబాద్‌లోని గాజుల రామారానికి చెందిన మనీశ్(19) వీఎన్ఆర్ కళాశాలలో బీటెక్ సెకండర్ ఇయర్ చదువుతున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. ముందే స్నేహితులతో వేసుకున్న ప్లాన్ ప్రకారం అతడి మిత్రులు హరి శంకర వరప్రసాద్, ప్రియాకర్, కౌటిల్య, సంజయ్, సాత్విక్, రాగ, తన్వి మొత్తం 8 మంది కలిసి నర్సాపూర్ రాయరావు చెరువు వద్దకు వచ్చారు. అక్కడ కట్టపై ఉన్న పార్కులో కాలక్షేపం చేసి అనంతరం మధ్యాహ్నం చెరువు తూము వద్ద ఉన్న మెట్లపై నుంచి నీటి అంచుకు చేరుకున్నారు. మెట్లపై నుంచి నీటిలో కాళ్లు పెట్టి సరదాగా ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మనీశ్ నీటిలో పడిపోయి మునిగిపోయాడు. మిత్రుడు కాపాడే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గజ ఈతగాళ్ల సాయంతో మనీశ్ మృతదేహాన్ని బయటకు తీశారు. రాయరావు చెరువు వద్దకు వచ్చి కాలక్షేపంతోపాటు విద్యార్థులు మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి గాయాలు


ఘటనా స్థలంలో బైక్‌లు

నిజాంపేట(మెదక్): రెండు బైక్‌లు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట్ గ్రామానికి చెందిన చింతకింది భాను స్వగ్రామం నుంచి పులిమామిడికి బైక్‌పై పని నిమిత్తం వెళ్తున్నాడు. కల్వకుంట్ల గ్రామ శివారులోకి రాగానే నార్లాపూర్ గ్రామానికి చెందిన బెజమైన వెంకటేశ్ బైక్‌పై అజాగ్రత్తగా వచ్చి భాను బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భానుకు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడి చిన్నాన్న రాములు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

యువకుడు మృతి, మరో యువకుడికి తీవ్ర గాయాలు


ప్రమాదస్థలంలో బస్సు, బైక్

వట్‌పల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని కిచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మద్దూరి అనిల్ కుమార్ (25)కుమ్మరి అనిల్ కుమార్ (26) బైక్‌పై కిచ్చనపల్లి గ్రామానికి వెళ్తున్నారు. అన్నాసాగర్ చెరువుకట్ట వద్దకు రాగానే నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మద్దూరి అనిల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జోగిపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బీజేపీ కుట్ర


- బడుగులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

జగదేవ్‌పూర్(గజ్వేల్): రిజర్వేషన్లు ఎత్తి వేయడానికి బీజేపీ కుట్ర చేస్తుందని, కుట్రను తిప్పి కొట్టడానికి సిద్ధంగా ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. బుధవారం మండలంలోని నిర్మల్‌నగర్ గ్రామంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించి అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలాలు వేసి ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, ఎడ్లబండ్లు, భూముల పంపిణీ చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించిన మోదీని దళిత సమాజం క్షమించదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీలకు 18 శాతం ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించి దళితులను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, జనార్దన్‌రెడ్డి, పద్మారావు, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

బుధవారం ఒక్కరోజే వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యమయ్యారు. ఇందులో ఓ వ్యక్తి, వలసకూలీ, విద్యార్థి ఉన్నారు.

సోదరి ఇంటికని వెళ్లి వ్యక్తి..


జాంగీర్

జిన్నారం (పటాన్‌చెరు): వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలోని కానుకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. కానుకుంట గ్రామానికి చెందిన జాంగీర్ (55) 25న తన సోదరి ముంతాజ్ చార్మినార్‌లో ఉంటుందని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అనంతరం జాంగీర్ సోదరుడు మహమ్మద్ గౌస్ ముంతాజ్‌కు ఫోన్ చేసి జాంగిర్ వచ్చిన విషయం పై ఆరా తీయగా రాలేదని చెప్పింది. చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తెల్లాపూర్‌లో వలస కూలీ


రబీ దాస్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కూలీ అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో బుధవారం జరిగింది. కొల్లూరు పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బిజయ్ రబీ దాస్ జీవనోపాధి కోసం తెల్లాపూర్‌కు రెండు నెలల కిందట వలసొచ్చాడు. తెల్లాపూర్‌లోని చెరువు కట్ట సమీపంలో గుడిసెలో ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. గత నెల 28న తోటి కూలీలు పనికి రావాలని పిలువగా రానని చెప్పాడు. సాయంత్రం తోటి కూలీలు గుడిసె వద్దకు వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో బుధవారం కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

హాస్టల్‌కని వెళ్లి విద్యార్థి


సుధాకర్

చేగుంట (తూప్రాన్): హాస్టల్‌కి వెళ్లి విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి కథనం మేరకు.. మాసాయిపేట మండలం రామంతపురం తండాకు చెందిన అంగోత్ సుధాకర్ రామాయంపేట ఎస్సీ బాలుర వసతి గృహంలో 9వ తరగతి చదువుతున్నాడు. హాస్టల్‌లో అస్వస్థతకు గురికాగా తండాకు తీసుకొచ్చారు. జ్వరం తగ్గాక గత నెల 11న హాస్టల్‌కి వెళ్లమని చేగుంటలో తండ్రి శ్రీను రామయంపేట బస్సు ఎక్కించాడు. ఇటీవల ఉగాది పండుగ కోసం సుధాకర్‌ను ఇంటికి తీసుకు రావడానికి తండ్రి హాస్టల్‌కు వెళ్లగా సుధాకర్ హాస్టల్‌కు రాలేదని వార్డెన్ తెలిపాడు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పునః ప్రతిష్ఠ చేపట్టడం శుభ సూచకం

మాధవానంద సరస్వతీ స్వామిజీ


యంత్ర ప్రతిష్ఠ చేస్తున్న మాధవానంద సరస్వతీ

దుబ్బాక: నరుడు నారాయణుడై ధర్మరక్షణ చేస్తే ఈ మానవజన్మకు సార్థకత లభిస్తుందని మాధవానంద సరస్వతీ స్వామిజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. దుబ్బాక పట్టణంలో నూతనంగా నిర్మించిన వరద పోచమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహానికి మాధవానంద సరస్వతీ స్వామిజీ యంత్ర ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ఆలయాలు నిర్మించి విగ్రహాలు ప్రతిష్టిస్తే సరిపోదని నిరంతరం ధూప, దీప నైవేద్యాలతో వెలుగొందేలా చూసినప్పుడే భగవంతుడు మనసు చల్లగా చూస్తాడన్నారు. ఎన్నో వందల ఏళ్ల కిందట నిర్మించిన ఈ ఆలయం శిథిలం కాగా భక్తులు ముందుకొచ్చి నూతనంగా ఆలయంతోపాటు అమ్మవారిని పునః ప్రతిష్ఠ చేసుకోవడం శుభ సూచకమన్నారు. అంతకు ముందు ఆలయంలో వేదపండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో అవాహిత దేవతా పూజ, హోమములు, ఆదివాసములు, ఆదివాస హోమం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పురాణేతిహాసాల్లో ప్రసన్న కథాకలితార్థయుక్తి

అష్టావధాని బ్రహ్మశ్రీ గౌరిభట్ల రుక్మిణీ బాలముకుందశర్మ


బాలముకుందశర్మను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

సిద్దిపేట ఎడ్యుకేషన్:పురాణేతిహాసాలలో ప్రసన్న కథాకలితార్థయుక్తి కల్గి ఉందని, అభినవశుక పండిత, సమన్వయ సార్వభౌమ బిరుదాంకితులు, అష్టావధాని బ్రహ్మశ్రీ గౌరీభట్ల రుక్మిణీ బాలముకుందశర్మ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రాచీన సాహిత్యం – కవితారీతులు అనే సదస్సులో పురాణేతిహాసాలలో ప్రసన్న కథాకలితార్థయుక్తి అనే అంశంపై బాలముకుంద శర్మ ప్రసంగించారు. నన్నయ గారి కవితా లక్షణాల్లో మొదటిదైన ప్రసన్న కథాకలితార్థయుక్తి. ఈ లక్షణం నన్నయకు ముందే పురాణేతిహాసాల్లో కనిపిస్తుందని నిరూపించడం ఈ ఉపన్యాస లక్ష్యం. కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి, తెలుగు విభాగ అధ్యాపకులను అభినందిస్తూ ప్రాచీన సాహిత్యం పైన విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. కార్యక్రమంలో పిట్ల దాసు, వెంకటరమణ, సంపత్, రామస్వామి, నరేశ్, నర్సింలు, శైలజ, రమణ, సాయి సురేశ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహనాలు దగ్ధం

- కారు, మూడు ద్విచక్రవాహనాలు కాలి బూడిద
- రూ.15 లక్షల ఆస్తి నష్టం


ప్రమాదంలో కాలిపోయిన కారు, బైకులు

సిద్దిపేటఅర్బన్: ఓ ఇంటిలో జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో ఓ కారు సహా మూడు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలోని మారుతీనగర్‌లో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. సీఐ విద్యాసాగర్ తెలిపిన కథనం మేరకు.. సిద్దిపేట పట్టణంలోని మారుతీనగర్‌లో బెల్లంకొండ వెంకటేశ్వర్‌రావు ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో విద్యుత్ మీటర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. కాసేపటికి మంటలను గుర్తించిన సురేశ్ అనే వ్యక్తి ఇంట్లోకి మంటలు వ్యాపిస్తున్నాయనే ఆందోళనతో ఫస్ట్ ఫ్లోర్ నుంచి కిందకు దూకగా స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం చుట్టుపక్కల వారి సాయంతో ఫైర్ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పివేయగా అప్పటికే వరండాలో పార్కింగ్ చేసిన కారు సహా మూడు ద్విచక్ర వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. వీటితో పాటు కింది పోర్షన్ డోర్లు, మూడు విద్యుత్ మీటర్లు, వైర్లు, బోర్ స్టార్టర్, డ్రైనేజీ పైపులు బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటేశ్వర్‌రావు వాపోయారు. కాగా విద్యుత్ మీటర్లలో తలెత్తిన సమస్య వల్లే షార్ట్ సర్క్యూట్ జరిగినట్టు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ నర్సింహులు పేర్కొన్నారు. బాధితుడు వెంకటేశ్వర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. షార్ట్‌సర్క్యూట్‌కు గల కారణాలపై సీఐ విద్యాసాగర్ ఆరా తీశారు.